# అధికారులందరూ.. తక్షణమే విధులకు

# హాజరుకావాలి



- ❑ నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్
- పునరావాస కేంద్రాల్లో 900 మంది
- ❑ లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలిస్తున్న అధికారులు
- ❑ నిరంతరం పరిస్థితిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఆనంద్
- ❑ పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిన అధికారులు
- ❑ భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా జిల్లా యంత్రాంగం

**నెల్లూరు,అక్టోబర్ 16,(నవభూమి):**:జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంది. జిల్లాకు భారీ వర్షాలు,తుఫాను ముప్పు ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ,వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం తో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్,జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ముందుగానే జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.దసరా సెలవులకు వెళ్లిన అధికారులు తక్షణమే విధులకు హాజరు కావాలని ,సెలవులో ఉన్న వారు సెలవులు రద్దు చేసుకుని రావాలని ఆదేశాలు ఇచ్చారు.జిల్లాలో భారీ వర్షాలు నమోదు కావడంతో జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అందరూ హెడ్ క్వార్టర్స్ లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి రోజూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష చేసి దిశా నిర్దేశం చేసారు.అధికారులు గ్రామ స్థాయిలో ఉండటం వల్ల ఇళ్లలోకి నీరు చేరగానే సత్వరమే స్పందించి పునరావాస కేంద్రాలకు చేర్చారు.పునరావాస కేంద్రాల్లో త్రాగునీరు, ఉదయం అల్పాహారం,రెండు పూటలా భోజనం తదితర సౌకర్యాలు కల్పించారు. జిల్లాలో ఇప్పటి వరకు 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 312కుటుంబాల్లోని 870మందిని తరలించారు.నెల్లూరు నగరంలో నక్కల సెంటర్ కు చెందిన 80 మందిని పీఎంఆర్ స్కూల్ కు తరలించారు.నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ బుధవారం వారికి స్వయంగా ఆహారం వడ్డించారు.జిల్లా కలెక్టర్ ఆనంద్,ఎస్పీ కృష్ణ కాంత్ ఇందుకూరుపేట మండలం గంగపట్నం పంచాయితీ శ్రీనివాసపురంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.భోజనం సక్రమంగా అందుతుందో లేదో ఆరా తీశారు.ఇల్లు లేని వారికి పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలోని ఆయా డివిజన్లలో ఆర్డీవోలు ,తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆత్మకూరు,కందుకూరు,కావలి డివిజన్ పరిధిలో 312 కుటుంబాల్లోని 870 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగింది.ఆత్మకూరు డివిజన్ ఆత్మకూరు మండలంలో బండారుపల్లి గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లో 5కుటుంబాలను,అప్పారావుపాలెం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో 15 కుటుంబాలను,కరటంపాడు గ్రామంలో అంగన్వాడి సెంటర్ లో 15 కుటుంబాలను, అనంత సాగరం మండలం పడమటి కంభంపాడు గ్రామ మండల పరిషత్ స్కూల్ లో 17 కుటుంబాలను, ఇనగలూరు పంచాయతీ కార్యాలయంలో ఐదు కుటుంబాలు, చేజర్ల మండలం పెళ్లూరు గ్రామంలో 11 కుటుంబాలను తరలించారు. నెల్లూరు డివిజన్ లోని బుచ్చిరెడ్డిపాలెం మండలం ఇసుక పాలెం గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లో 38 కుటుంబాలను,ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లో 5 కుటుంబాలకు పునరా వాసం ఏర్పాటు చేశారు.కందుకూరు డివిజన్ లో ఉలవపాడు మండలం మన్నేటికోట గ్రామంలో సైక్లోన్ సెంటర్ లో 35కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు.అల్లూరు మండలం సింగపేట గ్రామంలో 10కుటుంబాలు, కావలి డివిజన్ పరిధిలో ముసునూరు కావలి పట్టణంలో మండల పరిషత్ స్కూల్ రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి 141 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు. కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ లో 14 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు.బుధవారం వరకు జిల్లాలో మొత్తం సుమారు 900 మంది ప్రజలను పునరాస కేంద్రాలకు తరలించారు.పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు భోజన సౌకర్యాలు త్రాగునీరు, పాలు,బెడ్షీట్లు తదితర సౌకర్యాలు జిల్లా యంత్రాంగం కల్పించింది.ఇళ్లలో నీరు తగ్గే వరకు పునరావాస కేంద్రాలలోనే ఉంచాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.

## కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు



3




# తుఫాన్ పీడిత ప్రాంతాల్లో

# పేదలను ఆదుకోవాలి

- ◆ తుఫాను నష్ట నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- ◆ బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర జోనల్ ఇంచార్జ్ ముక్కు రాధాకృష్ణ గౌడ్



**నెల్లూరు,అక్టోబర్ 16,(నవభూమి):**:తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నెల్లూరు జిల్లా ప్రజలు అన్ని విధాల కష్ట,నష్టాలు పడుతున్నారని,నష్టపోయిన వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి ఓబిసి మోర్చ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కోస్తాంధ్ర (విజయవాడ గుంటూరు,నరసరావుపేట,బాపట్ల,ఒంగోలు, నెల్లూరు జిల్లాలు) జోనల్ ఇంచార్జ్ ముక్కు రాధాకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు మరింత కష్టాలు పడుతున్నారని,చేతి వృత్తులు,కూలీ పనులు లేక అల్లాడుతున్నారని, వారికి ప్రతి ఇంటికి ఐదు వేలు రూపాయలు డబ్బులు, నిత్యావసర వస్తువులు,బట్టలు ఇవ్వాలన్నారు .అంటువ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మెడిసిన్స్ ఇవ్వాలన్నారు.చిన్న,సన్న కారు రైతులకు నష్టపోయిన ఆకు కూరలు, కూరగాయలు తోటలు, నారు మడులు,మరి ఇతర పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన అన్నారు. చెరువులు,రోడ్లు,కాలువలు మరమత్తులు చేసి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి అన్ని వసతులు కల్పించాలని కోరారు. అలాగే ముంచుకొస్తున్న తుఫాన్ పట్ల ప్రజలు జాగ్రత్త గా వుండాలని, అధికారులు,ప్రజాప్రతినిధులు స్వచ్ఛంధ సంస్థలు నిర్వాహకులు, పారిశ్రామిక వేత్తలు తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## బస్సు నడుపుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి



2

## బస్సు నడుపుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి - బస్సులో 60 మంది ప్రయాణికులు






**బాపట్ల, అక్టోబర్ 16, (నవభూమి:** :బస్సు నడుపు తుండగా గుండెపోటుకు గురై డ్రైవర్ మృతి చెందిన సంఘటన కర్లపాలెం మండలంలో బుధవారం చోటుచేసుకుంది.

రేపల్లె నుంచి చీరాల వెళుతున్న బాపట్ల డిపో ఆర్ టి సి బస్సు కర్లపాలెం ముకుంద టీ స్టాల్ దాటిన తరువాత బస్సు డ్రైవర్ కు గుండెపోటు రావడంతో బస్సును పక్కనే ఉన్న పొలాలలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ డి. సాంబశివరావు అక్కడే చనిపోయారు. బస్సును పొలాలలోకి వెళ్లే సమయంలో ముందు వెళు తున్న సైకిల్ ను డీ కొట్టింది. సైకిల్ పై వెళుతున్న పిట్టు వెంకటేశ్వరరెడ్డి కాలికి తీవ్ర గాయమైంది. బస్సులో సుమారు ప్రయాణికులు సుమారు 60 మంది ఉన్నట్లు కండక్టర్ వినుకొండలరావు తెలిపారు. ప్రయాణికులు అందరూ క్షేమంగా ఉన్నారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

## జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసిన టిడిపి నాయకులు



**బాపట్ల, అక్టోబర్ 16, (నవభూమి:** బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ను తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జెసి ని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ యువత కార్యదర్శి అడే వంశీ, 33వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఐనంపూడి షాలెంరాజు, బాపట్ల పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు దారా అశోక్ ఉన్నారు.

## వక్తృత్వపు పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న కింతలి హైస్కూల్ విద్యార్థులు



**మాడుగుల అక్టోబర్ నవ భూమి** :వక్తృత్వపు పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న కింతలి హైస్కూల్ విద్యార్థులు మండలం లోని కింతలి హైస్కూల్ విద్యార్థులు వక్తృత్వపు పోటీల్లో ప్రతిభ కనబరిచారు.గత నెలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఆంగ్ల భాష వక్తృత్వ పోటీల్లో అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం లోని కింతలి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి అందుకున్నారు అని ఫౌండేషన్ వ్యవస్థాపకులుమాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగావిజేతలైన విద్యార్థులు మైచర్ల రమ్యశ్రీ , దండి ప్రత్యూష , కోటార లిఖిత లు ప్రథమ బహుమతి అందుకున్నారు.వీరిని పాఠశాల హెచ్.ఎమ్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేసారు.

## భాష్యం స్కూల్లో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు



**ఎమ్మిగనూరు, అక్టోబరు (నవభూమి):** పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో బుధవారం సిఈఓ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆహారపు అలవాట్లు మారటం వలన ఆరోగ్యం, ఇతర సమస్యలతో చాలామంది ప్రజలు బాధపడుతున్నారన్నారు. అందుకే మన ఆహారపు అలవాట్లను మార్చుకుంటే బాగుంటుందని తెలిపారు. బయట దొరికే ఫాస్ట్ ఫుడ్ ఆహారపును తీసుకోవడం తగ్గించడం చాలా మంచిదన్నారు. మన పిల్లలకు ఫాస్ట్ ఫుడ్ బల్ల దగ్గర దొరికే ఆహారంను తినిపించటం తగ్గించాలన్నారు. రోజువారి ఆహారంలో పోషక విలువలుండే పౌష్టిక ఆహారం, ఆకుకూరలు, కూరగాయలు పండ్లు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లులకు నిర్వహించిన ఫుడ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి ప్రిన్సిపల్ మాచాని కవిత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# మనిషిని మలిచిన మహర్షి...!

- వాల్మీకి మహర్షి జీవిత శైలి బోధన
- 'వేద వేద్యే పరే పుంసిజాతే దశరథాత్మజే! వేదః
- ప్రాచేత సాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా'
- ప్రవచన కర్తలు ఆదోని తెలుగు సుస్వర నాగరాజు ఆచారి, ఎర్రి స్వామి, పాపయ్య





**హొళగుంద. అక్టోబర్ 16(నవభూమి):** ఏనాటి రామకథ.. .ఇప్పటికీ ప్రాతఃస్మరణీయమే. ఏం వింటే ధర్మం కరతలామల కమవుతుందో, సత్య స్వరూపం ఆవిష్కృతమవుతుందో, హృదయం ఆనందంతో నిండిపోతుందో.. అలాంటి కథకు రూపకర్త వాల్మీకి. కావ్య రూప తపస్సు చూసి మానవ జాతికి మహెూపకారం చేసిన మహర్షి ఆయన అని ప్రవచనకర్త ఆదోని తెలుగు సుస్వర నాగరాజు ఆచారి,ఎర్రి స్వామి, పాపయ్య అన్నారు. మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో శ్రీ పోతులింగేశ్వర దేవాలయ ఆవరణంలో నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో భాగంగా ప్రవచన కర్త ఎర్రి స్వామి, పాపయ్య జీవిత శైలి బోధిస్తూ ఇలా అన్నారు. మనిషికి పుట్టుకతోనే పితృ రుణం, దేవరుణం, రుషి రుణం అనే మూడు రకాల రుణాలుంటాయి. రుషులకు ఎందుకు రుణ పడి ఉండాలనే దానికి సనాతన ధర్మం వివరణనిస్తోంది. ఆ రుషులు మానవాళికి మార్గదర్శక సూత్రాల్లాంటి శాస్త్రాలను అందిస్తారు. జాతి హితం కోసం విజ్ఞానాన్ని రూపొందిస్తారు. దీనికోసం అంతులేని తపస్సు చేస్తారు. కాబట్టి మనిషి రుషికి పుట్టుకతోనే రుణపడి ఉండాలి. అలాంటి రుషుల్లో ఒకరు రామాయణకర్త వాల్మీకి మహర్షి, ఎందుకంటే రామాయణం ఒక కావ్యం మాత్రమే కాదు మానవ జీవితానికి ఓ దిక్సూచి.ఎవరీయన?:తపస్సు అంటే తపించడం. తాననుకున్న లక్ష్యం కోసం కష్టతరమైన సాధన చేసి ఓ లక్ష్యాన్ని చేరుకోవడం. తపస్సు అంటే దహించేది అని కూడా అర్థం ఉంది. అహంకార మమకారాలను, దేహాభిమానాన్ని, హింస, కుటిలత్వం వంటివాటిని దహించడమే తపస్సు. రామనామాన్ని జపిస్తూ తీవ్ర తపస్సు చేసి, తన పూర్వ కర్మలను అందులో దగ్ధం చేసి రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహర్షిగా వాల్మీకి గురించి చెప్పాడు. బోయవాడైన ఈయన రుషిగా మారిన తరువాత ఓ వేటగాడి చేతిలో క్రౌంచ పక్షుల జంటలో ఒకటి మరణించడం చూసినప్పుడు కలిగిన ఆవేదన రామాయణ రచనకు కారణమైందని అన్నారు. దీంతో పాటు మరికొన్ని కథలు కూడా వాల్మీకి గురించి ఆయన బోధించారు.

## అభివృద్ధి పనులకు. ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదు: ఎమ్మెల్యే దేవ వరప్రసాద్





**. అమలాపురం. అక్టోబర్ 16.(నవ భూమి ప్రతినిధి)** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాక గ్రామంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని రాజోలు ఎమ్మెల్యే దేవరప్రసాద్ . పేర్కొన్నారు. బుధవారం తాటిపాక గ్రామంలో సర్పంచ్ కోటిపల్లి రత్నమాల అధ్యక్షతన జరిగిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటిపాక గ్రామంలో డంపింగ్ యార్డ్ సమస్యలు మార్కట్ భవన నిర్మాణ సముదాయ భవనాల నిర్మాణమునకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని అన్నారు. గ్రామ అభివృద్ధికి అందరూ. కలిసికట్టుగా పని చేస్తేనే గ్రామాలు సస్య శ్యామలగా ఉంటాయని పరిసర ప్రాంతాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని అప్పుడే గ్రామాల అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో. సర్పంచ్ కోటిపల్లి రత్నమాల. ఎంపీపీ. కేత శ్రీనివాస్ .తహసిల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ .మండల అభివృద్ధి అధికారి జి భీమారావు. పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు. మార్కుఫెడ్ డైరెక్టర్ గుండు భోగుల నరసింహారావు( పెద్ద కాపు). వైస్ ప్రెసిడెంట్ . కటికి రెడ్డి బుజ్జి బాబు. రాజకీయ కురువృద్ధులు సీనియర్ నాయకులు బోనం నాగేశ్వరరావు. ముప్పర్తి నాని .అడబాల విజయ్. చాగంటి స్వామి. గద్దం మహాలక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు

-వర్షప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం సేవలు

-ఎక్కడా వర్షపు నీరు ఆగకుండా ముందస్తు చర్యలు

-అండర్‌బ్రిడ్జిల వద్ద నిరంతరం మోటార్లతో నీరు తోడివేత

-అన్ని కాలువల్లో పూడికతీత పనులు

-జేసీబీలతో కాలువల్లో అడ్డంకుల తొలగింపు

-కంట్రోల్ రూం ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

-యుద్ధప్రాతిపదికన పనిచేసిన మున్సిపల్ కార్మికులు






**నెల్లూరు,అక్టోబర్ 16,(నవభూమి):**:భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి.గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ నగరంలో జనజీవనానికి ఎక్కడా ఎలాంటి అంతరాయం కలగకుండా మున్సిపల్ అధికారులు యుద్ధప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంకు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.జిల్లా కలెక్టరు ఆనంద్ ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ తమ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.నగరంలో వాహన చోదకులకు ఇబ్బంది కలగకుండా నగరపాలక సంస్థ అధికారులు,సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం,విజయమహాల్ గేటు,మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిల వద్ద మోటార్లు,మిషన్స్ ద్వారా ఎప్పటికప్పుడు వర్షపు నీటిని,అడ్డంకులను తొలగిస్తున్నారు.దీంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణిస్తున్నారు.గతంలో వర్షాకాలంలో ఈ బ్రిడ్జిల వద్ద నీళ్లు నిలబడి ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు ఇబ్బందులుపడేవారు. ఇప్పుడు అటువంటి ఇబ్బందికర పరిస్థితి లేకుండా చర్యలు చేపట్టారు.రోడ్లపై వున్న చెత్తను మున్సిపల్ ఆరోగ్యశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు తరలిస్తూ.. దుర్గంధం లేకుండా పరిసరాలు పరిశుభ్రం ఉంచుతున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ 314 మన్సూర్ నగర్, శివాజీ నగర్ సచివాలయం పరిధిలోని తాత్కాలిక ఆక్రమణలను నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు.46వ డివిజన్ ట్రంకు రోడ్డు మెయిన్ నందు అండర్ గ్రౌండ్ డ్రైనేజి బ్లాక్ ను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చేశారు. ఫత్తేఖాన్ పేట మేజర్ డ్రెయిన్ నందు ఉన్న వ్యర్థాలను తొలగించారు.51 వ డివిజన్ నందు చెట్ల కొమ్మలను ముందు జాగ్రత్తగా నగరపాలక సంస్థ సిబ్బంది తొలగించారు.నగరంలోని పొగతోట ప్రాంతంలో కాలువలపై ఉన్న సిమెంట్ పలకలను జెసిబి బ్రేకర్ల ద్వారా తొలగించి కాలువలలో ఉన్న పూడికను తొలగించారు.ఎంజిబిమాల్ ముందు ర్యాంప్‌లను జేసీబీ సహాయంతో పగలకొట్టడం వలన చుట్టు పక్కల వున్న చిన్న కాలువల్లో పూడిక తీయడానికి, వర్షపు నీరు కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు.నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీ,వెంకటేశ్వరపురం వద్ద వర్షపు నీటిని మోటార్లు సహాయంతో తొలగిస్తున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధి లోని 21వ డివిజన్ మాగుంట లేఅవుట్ వద్ద పైపులలో మట్టి పేరుకొనిపోయి వర్షపు నీరు ప్రవాహానికి ఆటంకం ఏర్పడడంతో ఇంజనీరింగ్ అధికారులు వెంటనే మిషన్ పవర్ సహాయంతో పైపుల్లో వున్న మట్టిని వెంటనే తొలగించి వర్షపు నీరు సాఫీగా పారునట్లు చేశారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు,సిబ్బంది ఆత్మకూరు బస్టాండ్, రామాలింగాపురం, మాగుంట లేఅవుట్, విజయమహల్ గేట్ వద్ద వాహన చోదకులకు ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వర్షపు నీటిని ఎప్పటికప్పుడు మోటార్ల సహాయముతో తొలగిస్తునారు. భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కార్మికులు నిరంతరాయంగా అందిస్తున్న సేవలను చూసి నగర ప్రజలు కార్పొరేషన్ అధికారుల పనితీరు భేష్ అంటూ అభినందిస్తున్నారు.

## సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు శిక్షణ తరగతులు



**ఎమ్మిగనూరు, అక్టోబర్ 16 (నవభూమి):**కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి నందు బుధవారం సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికెట్ కోర్స్ కింద ఉమ్మడి జిల్లాలోని రైతులకి శిక్షణ తరుగులు ప్రారంభమయ్యాయి జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంస్థల ఆధ్వర్యంలో రెండు వారాల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామాంజినేయులు, డీసిఓ మాట్లాడుతూ,ఈ కోర్స్ ఆవశ్యకత గురించి వివరించడం జరిగింది , నేల రకాలు మరియు నేలలోని మొక్కల పోషకాలు, భూమిలో ప్రాథమిక, ద్వితీయ పోషకాల పాత్ర మరియు వాటి లోప లక్షణాలు, మొక్కలలోని సూక్ష్మపోషకాల పాత్ర, పనితీరు, నేల పోషక స్థితి సేంద్రియ ఎరువుల రేటింగ్. వివిధ ప్రధాన పంటలకు ఎరువుల మోతాదు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. కే. రాఘువేంద్ర చౌదరి, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్, శ్రీలత, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సుజాతమ్మ, నాగేంద్రయ్య, శ్రీ చందన , నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**కౌతాళం, అక్టోబర్16(నవభూమి న్యూస్ ):** మండల కేంద్రమైన కౌతాళంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని బుధవారంచేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతులమీదుగా అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. వైయస్సార్ కాలనీలో సీసీ రోడ్డుకి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు సమస్యలు ఉంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ సాంబయ్య, తహసిల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపిడిఓ సుబ్బరాజు, ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ శ్రీనివాస, వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాద్ దేశాయ్ స్వామి, ఎంపీపీ అమరేశ, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మాబుసాబు, నదీచాగి రామన్నగౌడ, ఏకాంరెడ్డి,సర్పంచ్ పాల్ దినకరన్, అనిల్ కుమార్, బుచ్చయ్య,,మహేష్, సమ్మద్,తిక్కయ్యా, ఈశప్ప, శివరాంవివిధ గ్రామాల నాయకులు, సర్పంచుల, ఎంపిటిసిలు,కార్యకర్తలు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం. పల్లె పండుగలతో ప్రతి ఇంట్లో అభివృద్ధి వెలుగులు. శంకుస్థాపనల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు





**అమలాపురం. అక్టోబర్ 17.(నవభూమి ప్రతినిధి)** అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు పేర్కొన్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గ అమలాపురం రూరల్ మండలం బట్నవల్లి. ఏ వేమవరపాడు. వేమవరం. జనుపల్లి. పాలగుమ్మి గ్రామాలలో జరిగిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన భాజపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించారు అని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో శంకుస్థాపనలు చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు టిడిపి కార్య నిర్వాహ కార్యదర్శి మెట్ల రమణబాబు .ఆయా గ్రామాల సర్పంచులు .ఎంపీటీసీలు. టిడిపి. జనసేన .బిజెపి కూటమి నాయకులు మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## పిఏ రాసురి శశిదేవి కుమార్తెకు అన్నప్రాస చేసిన ఎమ్మెల్యే రాము



**గుడివాడ టౌన్ అక్టోబర్16(నవభూమి న్యూస్ ):**చిన్నారి రాసూరి డెన్సికి ఆశీస్సులు అందించిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వ్యక్తిగత సహాయకుడు రాసూరి శశిదేవ్ జెస్సింత దంపతుల కుమార్తె చిన్నారి డెన్సీకు బుధవారం అన్న ప్రాసన నిర్వహించారు.అన్నప్రాస కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చిన్నారి డెన్సికు ఘనహారం తినిపిస్తూ ముద్దాడారు ఆయురారోగ్యాలతో విద్యాబుద్ధులు నేర్చుకొని చిన్నారి ఎంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు చేవూరు జగన్మోహన్రావు,చిన్నారి డెన్సికు ఆశీస్సులు అందజేశారు.

# వర్షపు నీటి పారుదలకు అన్ని డివిజన్లలో ప్రత్యేక చర్యలు

**-పునరావాస బాధితులకు మెరుగైన సదుపాయాలు**
**-కమిషనర్ సూర్య తేజ**





**నెల్లూరు,అక్టోబర్ 16,(నవభూమి)::** నెల్లూరు నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు రోడ్లపై,లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల్లోకి చేరకుండా అవసరమైన అన్ని చర్యలను నిర్విఘ్నంగా చేపడుతున్నామని,అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజల జీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు.నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో కార్పొరేషన్ వివిధ విభాగాల అధికారులతో కలిసి జరుగుతున్న సహాయక చర్యలను కమిషనర్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జెసిబి వాహనాల సహాయంతో నగర వ్యాప్తంగా జరుగుతున్న డ్రైన్ కాలువల పూడికతీత, ప్రధాన కాలువల ద్వారా వర్షపు నీటి పారుదలకు చేపట్టిన పూడికతీత పనులను కొనసాగిస్తూనే ఉన్నామని చెప్పారు.నగరవ్యాప్తంగా ఉన్న పెద్ద హోర్డింగులను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో గుర్తించి ప్రమాదకరమైన స్థితిలో ఉన్న వాటిని తొలగించామని,ఏ ప్రాంతంలో కూడా హోర్డింగుల వలన ప్రాణ,ఆస్తి నష్టాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ప్రకటించారు.నగర పాలక సంస్థ సూచించిన నిబంధనలను ఉల్లంఘించి మురుగునీటి కాలువలపై నిర్మించిన ర్యాంపులు, మెట్లు, ఇతర నిర్మాణాలను తొలగించామని కమిషనర్ తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నగర వ్యాప్తంగా విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు.లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను గుర్తించి, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలకు వారిని తరలిస్తున్నామని, బాధిత ప్రజలకు కేంద్రాల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలియజేశారు.రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలలో ప్రజలకు తాగునీరు, ఆహారం, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, పారిశుధ్యం తదితర సదుపాయాలను కల్పించి బాధిత ప్రజలకు అవసరమైన అన్ని చర్యలను ప్రణాళిక బద్ధంగా చేపడుతున్నామని కమిషనర్ వెల్లడించారు.లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు వర్షాల నేపథ్యంలో స్థానికంగా ఏమైనా సమస్యలు ఏర్పడితే 0861 2356777, 0861 2316777 నెంబర్లకు సమాచారం అందించి నగర పాలక సంస్థ నుంచి తగిన సహాయం పొందాలని కమిషనర్ సూచించారు.ప్రజలంతా వర్షాలకు ఇండ్లలోనే ఉండి రక్షణ పొందాలని, అత్యవసర సమయాల్లో మాత్రమే బయట సంచరించాలని కమిషనర్ సూచించారు.కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ కి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే తగిన సహాయ చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ స్పష్టం చేసారు.

## వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**అప్రమత్తంగా ఉండాలని సూచన**





**పర్చూరు, అక్టోబర్ 16 ( నవభూమి )** చిన్నగంజాం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం పరామర్శించారు. గత నాలుగు రోజుల కురుస్తున్న వర్షాలకు పెద్దగంజాం పల్లిపాలెం లో వరద ఉధృతి పెరిగింది. దీంతో పలు ఇండ్లలోకి నీరు చేరింది. అలాగే ఎగువ ప్రాంతాలలో వరద నీరు ఉదృత్తి పెరగడంతో బకింగ్ హామ్ కాలువ, నాగన్న వాగు చప్టా, కొంగల వాగు చప్టాలు పొంగిపొర్లుతున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆయా వాగులను పరిశీలించారు. అలాగే నీట మునిగిన పంటలను పరిశీలించారు స్థానికులతో మాట్లాడి పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్థానికులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ చేయించాలన్నారు. ఎమ్మెల్యే ఏలూరి వెంట తహసిల్దార్ ప్రభాకర్ ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య, ఆజాద్, అసోది సుబ్బారెడ్డి, కృష్ణ, వెంకటేశ్వర్లు, బాబు, నాగరాజు తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ తుషార్



**చిన్నగంజాం, అక్టోబర్ 16 ( నవభూమి )** చిన్నగంజాం పోలీస్ స్టేషన్ ను బుధవారం ఎస్పీ తుషార్ డూడి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఇటీవల కాలంలో నమోదు అయిన క్రైమ్ వివరాలు గురించి ఎస్పీ సీఐ రమణయ్య, ఎస్సై సురేష్ లను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రవహిస్తున్న వాగులపట్ల తీసుకోవలసిన చర్యలను గురించి ఎస్పీ తుషార్ డూడి ఎస్సై కు పలు సూచనలు చేశారు. వాగులు, వంకలు, కల్వర్టులు వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ముంపు గ్రామాలను గుర్తించి ప్రజలను పునరావాసాలకు తరలించాలని ఎస్పీ తుషార్ డూడి తెలియజేశారు. ప్రజలు ఎవరు అధైర్యపడవద్దని ఏ సమస్య ఉన్న 100,112 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన తెలిపారు.

## రైతులు ప్రోత్సాహాలను వినియోగించుకోవాలి: ఏఈఓ దీప్తి



అద్దంకి, అక్టోబర్ 16 ( నవ భూమి ) అద్దంకి మండలంలోని నాగులపాడు, వేలమురిపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ ఏఈఓ దీప్తి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పూలు మరియు కూరగాయల సాగుకు రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరాకు 8 వేలు, పూలు సాగు చేసిన రైతులకు 6,200 రూపాయలు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. కావున రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని దీప్తి కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి వెంకటకృష్ణ, సర్పంచ్ అంజయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, సహాయకరాలు అనూష తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై చొరవతో వాడరేవు ప్రజలకు తప్పిన ముప్పు



**చీరాల, అక్టోబర్ 16 ( నవ భూమి )** చీరాల వాడరేవు గ్రామంలో వర్షాల కారణంగా స్థానిక వైయస్సార్ కాలనీ నందు నీట మునిగిన ఇళ్లను బుధవారం ఎస్సై శివకుమార్ పరిశీలించారు. విషయాన్ని అధికారులకు తెలియజేసి జెసిబి సహాయంతో కాలువ తీయించి వర్షపు నీటిని సముద్రపు వైపు మళ్ళించారు. సమస్యను సకాలంలో తెలుసుకొని వెంటనే పరిష్కరించిన ఎస్సై శివకుమార్ కు స్థానిక కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటానని ఎస్సై శివకుమార్ వారికి తెలియచేశారు.

# మంత్రి సారధ్యంలో ప్రగతి పథంలో పల్లెలు .. ఎంపీడీవో రాజ్యలక్ష్మి



**కురువానిపాలెం, అక్టోబర్ 16 ( నవభూమి )** కుర్రవానిపాలెం గ్రామంలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, సర్పంచ్ నాదెండ్ల దశరథ రామయ్య పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు లకు శ్రీకారం చుట్టినట్లు ఆమె చెప్పారు. సైడ్ కాలువలు, సీసీ రోడ్లు నిర్మాణాలు వెంటనే చేపట్టాలని గుత్తేదారులకు సూచించినట్లు ఎంపీడీవో తెలియచేశారు. అనంతరం సర్పంచ్ నాదెండ్ల దశరథ రామయ్య మాట్లాడుతూ నాణ్యతలో ఎక్కడ రాజీ లేకుండా పనులు నిర్వహించాలని గుత్తేదారులకు సూచించినట్లు చెప్పారు. మంత్రి రవికుమార్ సారధ్యంలో పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వెంకటరమణ, సెక్రటరీ దుర్గ, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఏపీఓ కోటేశ్వరి, పశుసమర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి: హేబేలు



**పంగులూరు, అక్టోబర్ 16 ( నవభూమి)** అద్దంకి నియోజకవర్గ జై భీమ్ రావు భారత్ పార్టీ సమన్వయకర్త హేబేలు బుధవారం బాపట్లలో జాయింట్ కలెక్టర్ ప్రకర్ జైన్ ను కలసి పంగులూరుకు చెందిన వివోఏలు గొళ్ళ సుభాషిణి, షేక్ మీరాబీ లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అందజేశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వివోఏలను తొలగించారని హేబెలు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. హైకోర్టు ఉత్తర్వులను పాటించి వారిని విధుల్లోకి తీసుకోవాలని హేబేలు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు మందా జోసఫ్ పాల్గొన్నారు.

# 120 మద్యం సీసాలు స్వాధీనం: ఎస్సై వెంకటేశ్వర్లు




**వేటపాలెం, అక్టోబర్ 16 ( నవ భూమి)** వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం గ్రామం నందు కిరాణా షాప్ నడుపుతున్న కంజుల గోపాల్ రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారంతో ఎస్సై వెంకటేశ్వర్లు బుధవారం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. అతని వద్ద నుంచి 120 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలో అక్రమ మద్యం, పేకాట, అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్సై వెంకటేశ్వర్లు తెలియజేశారు.

# నేడు మోదేపల్లిలో మంత్రి గొట్టిపాటి పర్యటన



**అద్దంకి, అక్టోబర్ 16 ( నవభూమి)** అద్దంకి మండలం మోదేపల్లి గ్రామంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమం లో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ కార్యాలయ వ్యక్తిగత సిబ్బంది తెలియ చేశారు. గ్రామంలో జరిగే పలు అభివృద్ధి పనులకు మంత్రి రవికుమార్ శంకుస్థాపన చేస్తారని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు

**విశాఖ–నవభూమి:** జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. రెండు రోజుల క్రితం లాటరీలో మద్యం దుకాణాల లైసెన్సులను దక్కించుకున్న వ్యాపారులు.. హడావిడిగా లీజుకు షాపులు తీసుకుని విక్రయాలను ప్రారంభించారు. మద్యం షాపులు కావడంతో సాధారణ అద్దెలతో పోలిస్తే రెట్టింపు చెల్లించాల్సి వచ్చిందని, అడ్వాన్స్‌లు కూడా భారీగా ఇచ్చినట్టు ఓ మద్యం దుకాణం నిర్వాహకులు చెబుతున్నారు. అనకాపల్లి పట్టణం జీవీఎంసీ పరిధిలో ఉండడంతో ఇక్కడ కేటాయించిన 12 షాపులను విశాఖ జిల్లా ఎక్సైజ్ అధికారులు లాటరీ పద్ధతిలో కేటాయించారు.




# రాష్ట్రం నుంచి ముగ్గురు ఐఏఎస్‌లు రిలీవ్

**అమరావతి–నవభూమి:** ఏపీ నుంచి ముగ్గురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం సి.హరికిరణ్(2010), జి.సృజన(2013), శివశంకర్ లోతేటి(2013) ఐఏ ఎస్‌లను డీవోపీటీ ఆదేశాల మేరకు రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం హరికిరణ్ ఆరోగ్యశాఖ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయన స్థానంలో ఇన్‌చార్జి ఏర్పాట్లు చేసుకోవాలని ఆరోగ్యశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా ఎం.సృజన, వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌గా శివశంకర్ లోతేటి విధులు నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఇన్‌చార్జ్ కలెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎం.సృజన, శివశంకర్ హైదరాబాద్‌లోనే ఉన్నారు. కాబట్టి ఏపీ రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వగానే తెలంగాణలో రిపోర్ట్ చేశారు. సి.హరికిరణ్ మాత్రం గురువారం ఉదయం తెలంగాణ సీఎస్‌కు రిపోర్ట్ చేయనున్నారు. తెలంగాణలో రిలీవ్ అయిన ఐదు మందిలో ఎం.ప్రశాంతి ఏపీలో రిపోర్ట్ చేశారు. వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్ మెయిల్ ద్వారా ఏపీ సీఎస్‌కు తమ జాయినింగ్ రిపోర్టులు పంపించారు. గురువారం ఉదయం వ్యక్తిగతం ఏపీ సీఎస్ వద్ద రిపోర్ట్ చేయనున్నట్లు సమాచారం. కాగా, ఏపీ అధికారుల విషయంలో సీఎం చంద్రబాబు ఉత్తర్వుల మేరకు సీఎంఓ, డీవోపీటీకి లేఖ రాసింది. ముగ్గురు ఐఏఎస్‌లను రిలీవ్ చేసే విషయమై నెల రోజుల గడువు కావాలని, ఈ లోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని కోరింది. ఆ లేఖపై డీవోపీటీ నుంచి స్పందన లేకపోవడంతోనే బుధవారం ముగ్గురు ఐఏఎస్‌లను రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




# అమరావతే ఏకైక రాజధాని

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన
- ఆర్థిక రాజధానిగా విశాఖ
- కర్నూలులో హైకోర్టు బెంచ్
- ఇక ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు
- రాజధానిలో టాటా ఇన్నోవేషన్ హబ్
- విశాఖ రాజమండ్రి, తిరుపతి,
- విజయవాడ/గుంటూరు, అనంతలో జోన్లు
- కేబినెట్‌లో కీలక నిర్ణయాలు..
- మీడియాకు వెల్లడించిన సీఎం చంద్రబాబు.



**అమరావతి–నవభూమిబ్యూరో:** రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచీ ఒక వ్యాపారవేత్త తయారయ్యేలా, ఐదేళ్లలో యువతకు ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆరు పాలసీలను రూపొందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన ఆరు పాలసీలు గేమ్ చేంజర్లుగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు. పారిశ్రామికవేత్తల కు మళ్లీ నమ్మకం కుదిరేందుకుగాను అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. అమరావతే ఏకైక రాజధానిగా ఉంటుందని పునరుద్ఘాటించారు. విశాఖ ఆర్థిక రాజధానిగా ఉంటుందని, కర్నూలుకు హైకోర్టు బెంచ్ వస్తుందని తెలిపారు. బుధవారం మంత్రివర్గ సమావేశం అనంతరం వెలగపూడి సచివాలయంలో మంత్రులు కొలుసు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్‌లతో కలసి చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. పెట్టుబడుల ఆకర్షణ.. ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఎలక్ట్రానిక్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ డెవలప్‌మెంట్, ఎంఎసఎంఈ పాలసీ, ప్లగ్ అండ్ ప్లే ఇండిస్ట్రియల్ పాలసీలను తీసుకువచ్చామని చంద్రబాబు చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే....

**రతన్ టాటా ఇన్నోవేషన్ జోన్‌లు..**

"అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తాం. ఈ హబ్ ద్వారా పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు అవసరమైన మేథో, సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయించుకోవచ్చు. విశాఖ, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు/కృష్ణా, అనంతపురంలో రతన్ టాటా ఇన్నోవేషన్ జోన్‌లను ఏర్పాటు చేస్తాం. నాలెడ్జ్ ఎకానమీకి ఇన్నోవేషన్ హబ్‌లు కేంద్రాలుగా ఉండాలి. రాష్ట్రంలో 2047 నాటికి 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించేలా పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తాం. వచ్చే నెల మొదటి వారంలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తాం. ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ జరిగేలా రాష్ట్ర ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్ తీసుకువస్తాం. భావనపాడులో పదివేల ఎకరాల్లో ఇండిస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది నాటికి భావనపాడు పోర్టును పూర్తి చేస్తాం. భోగాపురం విమానాశ్రయాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించి .. ప్రతి ఇంట్లోనూ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం"

**జాబ్ ఫస్ట్ నినాదంతో..**

"జాబ్ ఫస్ట్ నినాదంతో పారిశ్రామిక విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తాం. ఉద్యోగాల కల్పన ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఉంటాయి. పారిశ్రామికవాడల్లోనూ..పరిశ్రమల ఏర్పాటులోనూ సామాజిక సమతుల్యతను పాటిస్తాం. మహిళలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలను భాగస్వాములను చేస్తాం. రాష్ట్రంలో ఎంఎసఎంఈ ఇండస్ట్రీలన్నింటినీ పరిశీలించి..కాయిలా పడ్డవాటిని పునరుద్ధరిస్తాం. పరిశ్రమలను తీసుకువచ్చే బాధ్యత అధికారులదే. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తాం. రాష్ట్రమంతా గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేస్తాం. నౌకాశ్రయాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా మారుస్తాం. సోలార్, విండ్ , హైబ్రీడ్ సోలార్, పంప్డ్ స్టోరేజీ హైడల్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్ల అనుమతిలో 'ముందు వచ్చిన సంస్థలకు ముందుగా' పద్ధతిని అమలు చేస్తాం. ఎంఎసఎంఈలకు రూ.500 కోట్ల కార్పస్‌ఫండ్‌ను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.